సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం | 13 | సెప్టెంబర్ | 2024



హెచ్ఐవీ రోగులకు అందని పింఛన్లు..! - 8లో

విజయనగరం జిల్లాలో హెచ్ఐవీ రోగులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. పింఛన్లు అందజేయకుండా ఆవేదనకు గురిచేస్తోంది.



సువర్ణముఖిలో సిల్ట్ తొలగింపు

సువర్ణముఖి నదిని ఆనుకుని ఉన్న కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ కోసం నదిలో మడ్డి, బురద, ఇసుక (సిల్ట్) తొలగింపు చర్యలు చేపడతామని జేసీ ఎస్.సేతుమాధవన్ తెలిపారు. - 8లో



17నుంచి స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత - 8లో

సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 1వ తేదీవరకు 'స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల బదిలీల గడువు పెంపు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిన ఈ అంశాన్ని..తాజాగా సెప్టెంబరు 22 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 23వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. ఎక్సైజ్ శాఖకు సంబంధించి సెప్టెంబరు 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఎస్ఈబీ' వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం విదితమే. అందులో పని చేస్తున్న వారంతా తిరిగి ఎక్సైజ్ శాఖకు వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారి బదిలీలకు మరింత గడువు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఆగస్టు నెలలో ప్రభుత్వం బదిలీలకు పచ్చ జెండా ఊపింది. తొలుత ఆ నెల 31..తర్వాత సెప్టెంబరు 15 వరకు అవకాశం కల్పించింది. దీంతో వందలాది మంది ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తెచ్చుకుని, తాము కోరుకున్న ప్రాంతానికి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. తాజాగా మరోసారి గడువు పొడిగించడంతో వారంతా నిరుత్సాహానికి గురవుతున్నారు.

13, 14 తేదీల్లో ఎన్‌సీఎస్‌టీ బృందం పర్యటన

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి, జలుమూరు మండలాల్లో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ బృందం ఈనెల 13,14 తేదీల్లో పర్యటించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాటోతు హుస్సేన్‌తో పాటు మరో ఆరుగురు బృందం పర్యటిస్తుందన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాకుళం కలక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, గిరిజన సంఘాల నాయకులతో వివిధ అంశాలపై చర్చిస్తుందన్నారు.

పర్యాటక పనులు పూర్తి చేయాలి



పర్యాటక పనులు పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: పర్యాటక పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని ఆదలి వ్యూపాయింట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులు చూశారు. ఎక్కవ మంది పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణకుమార్, పీహెచ్‌వో గణేష్, ఏఈ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సీట్ల భర్తీకి ఓపెన్ కౌన్సెలింగ్

- గిరిజన వర్సిటీ వీసీ కట్టిమణి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20న ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ప్రవేశపరీక్ష రాసిన వారు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు ఈ నెల 19లోగా www.ctuap.ac.inలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్ 08922960333ను పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

సర్వే అడ్డగింత

వేపాడ: పోలవరం ఎడమ కాలువ సర్వేను వేపాడ మండలం దబ్బిరాజుపేట రెవెన్యూ పరిధిలోని రైతులు గురువారం అడ్డుకున్నారు. ఎడమ కాలువ డిజైన్ మార్చాలని సర్వే అధికారులను డిమాండ్ చేశారు. ఎనిమిది మండలాల్లోని 58 గ్రామాల మీదుగా సాగే సర్వేను అడ్డుకుంటామని సర్వే వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ చల్లాజగన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ జిల్లా కమిటీ నాయకుడు ఎ.రామకృష్ణ, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, ఎస్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ విద్యుత్ యూనిట్లు

విజయనగరం ఫోర్ట్: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను రాయితీపై అందిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోలార్ యూనిట్ల వల్ల గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లు ఖర్చు మిగులుతుందన్నారు. 10 చ.మీటర్ల ఇంటి పైకప్పుపై కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

ఔరా..!

- ఆ బడిలో పిల్లలే పనోళ్లు



ఉలిపిరి పాఠశాలలో భోజన వడ్డించేందుకు సిద్ధమవుతున్న విద్యార్థినులు



గేటు కీపర్ ఉద్యోగం చేస్తున్న బాలికలు

కొమరాడ: మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలిక పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థినులు ఆ పాఠశాలలోనే పనివారుగా వ్యవహరించాల్సి వస్తోంది. ఆ పాఠశాలలో 360 మంది బాలికలు చదువుతున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల మధ్య రగిలిన మనస్పర్థలు చినికిచినికి గాలి వానలా మారాయి. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయ కుర్చీకి పోటీ నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ ప్రభావం బాలికల చదువుపై పడుతోంది. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉద్యోగులంతా ఇష్టారాజ్యం వ్యవరి స్తున్నారని విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహంలో గేటు కీపర్ నుంచి భోజనం వడ్డన వరకు పిల్లలే పనోళ్లుగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థి సంఘాలతో పాటు పలు ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. భోజనం మెనూ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు అధికారులు ఉలిపిరి వసతి గృహంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనికి సంబంధించి వార్డెన్ రాజేశ్వరిని వివరణ కోరగా పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలికలతో పనిచేయించాల్సి వస్తోందని చెప్పారు.

వీడీవీకేలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రతి మండలానికి ఒక మోడల్ వన్‌ధన్ వికాస్ కేంద్రం(వీడీవీకే) ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, డీఆర్‌డీఏ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వీడీవీకే పరిధిలో కనీసం 15 స్వయం సహాయక సంఘాల గ్రూపులు, 300 మంది సభ్యులు ఉండాలని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా స్వయం సహాయక సంఘ కార్యకలాపాలు నిర్వహించాలని, గిరిజన ఉత్పత్తుల కొనుగోలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ చేపట్టి సభ్యులకు ఆర్థికంగా లబ్ధి చేకూరేలా కేంద్రాలన్నీ రూపొందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ ఎస్‌ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆయనంతే..!



- ప్రభుత్వ వైద్య విద్యపై ఇక ప్రైవేటు పెత్తనం!
- జగన్ నిర్మించారని ప్రభుత్వ మెడికల్ కాలేజీపై చంద్రబాబు కన్నెర్ర
- ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల దశాబ్దాల ఆకాంక్షపై కక్ష
- రూ.500 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన వైద్య కళాశాల నిర్వీర్యానికి కుట్రలు
- నిర్వహణాభారం సాకుతో ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే ప్రయత్నాలు
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య మరింత దూరం
- బడుగు వర్గాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మళ్లీ భారమే!

'ప్రైవేట్' చేసేయడమొక్కటే తెలుసు...

చంద్రబాబు గత 14 ఏళ్ల పాలనలోనే కాదు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో చెప్పుకోదగిన బృహత్తర ప్రాజెక్టు ఒక్కటీ కనిపించదు. ఆయన చేసిందల్లా ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని చెరకు రైతులకు ఆశాదీపంగా ఉన్న లచ్చయ్యపేటలోని ప్రభుత్వ చక్కెర కర్మాగారాన్ని ప్రైవేట్ బాటపట్టించడమే. ఆయన పుణ్యాన దాని మనుగడే ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. ఇప్పుడు అదే పరిస్థితి విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వస్తే లక్షలాది మంది ప్రజలకు అందుతున్న నాణ్యమైన వైద్యసేవలు దూరమైపోతాయి. అంతేకాదు అడిగినంత డబ్బు చెల్లించలేకపోతే ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేధింపులు ఎలా ఉంటాయో ప్రజలకు అవగతమే. జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉచితంగా లభిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, శస్త్రచికిత్సలు ప్రజలకు భారమే అవుతాయి.

సాక్షిప్రతినిధి, విజయనగరం:

అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కావాలంటే ఉమ్మడి విజయనగరం జిల్లాల ప్రజలు నిన్నామొన్నటి వరకూ విశాఖనగరానికి వ్యయప్రయాసలకోర్చి పరుగు తీయాల్సిందే. తమకొక ప్రభుత్వ మెడికల్ కాలేజీ పెడితే ఆ కష్టాలు తీరతాయని కొన్ని దశాబ్దాలుగా వారు కోరుకుంటున్నారు. మెడికల్ కాలేజీ పెడతా అదిగో ఇదిగో అంటూ తన 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపించారే తప్ప ఏనాడూ కార్యాచరణ లేదు. చివరకు మాన్సాస్ ఆధ్వర్యంలో పెడతామని పూసపాటి ఆనంద గజపతిరాజు ముందుకొస్తే... అది తమ వల్ల కాదని ఆయన సోదరుడైన టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజు చేతులెత్తేశారు. ఇలాంటి దిక్కూమొక్కూలేని పరిస్థితుల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయనగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మించింది. అదే ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కన్నెర్ర అయ్యింది. దాదాపు రూ.500 కోట్ల ప్రజాధనంతో 70 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కళాశాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్రలు మొదలయ్యాయి. ఈ మెడికల్ కాలేజీకి అనుబంధంగా బోధనాసుపత్రిగా తీర్చిదిద్దిన జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు ఎంతో మెరుగుపడ్డాయి. ఓపీ వేలల్లో పెరిగింది. ఇప్పుడు మెడికల్ కాలేజీ ప్రైవేట్‌పరమైతే ఈ ఆస్పత్రిలో కూడా వైద్యం సామాన్యులకు భారమే అవుతుంది. యూజర్ చార్జీల పేరుతో మోత తప్పదు.

• మెడికల్ కాలేజీ పెట్టలేకపోయారు

విజయనగరం ప్రజల ఓట్ల కోసం 2019 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నాటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కాస్త హడావిడి చేశారు. అంతకు కొద్ది నెలల ముందు అప్పటి జిల్లా మంత్రి కిమిడి మృణాళిని టీడీపీ ఎమ్మెల్యేలతో కలిసి స్థల పరిశీలన పేరిట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషా ఆస్పత్రిలో పర్యటించారు కూడా. ఆ తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల ఊసే ఎత్తలేదు. తర్వాత మాన్సాస్ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారు. అందుకు అవసరమైన నిధుల కోసం విలువైన మాన్సాస్ భూములను చౌకగానే అమ్మేశారు. తీరా మెడికల్ కాలేజీ పెట్టే పరిస్థితిలో మాన్సాస్ లేదని ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు స్వయంగా ప్రభుత్వానికి లేఖ రాయడం అప్పట్లో సంచలనమే అయ్యింది.



• జగన్ చేసి చూపించారు

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయంతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విజయనగరానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరుచేసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయనే శంకుస్థాపన చేశారు. గాజులరేగ సమీపంలో 70 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలను రూ.500 కోట్ల వ్యయంతో అద్భుతంగా నిర్మించారు. గత ఏడాది తరగతులనూ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వచ్చి ప్రారంభించారు. ఇలాంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రారంభం ఒకే దఫా పాలనాకాలంలో జరగడం ఒక విశేషం. 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మొదటి ఏడాది వైద్య విద్యార్థులకు తరగతులు విజయవంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సర తరగతులు మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి.

• ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు

మెడికల్ కాలేజీకి అనుబంధంగా విజయనగరంలోని జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య సిబ్బంది సంఖ్య పెరిగింది. మౌలిక వసతులు ఎంతో మెరుగయ్యాయి. జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు ల్యాబొరేటరీలో కొన్ని రకాల పరీక్షలు మాత్రమే చేసేవారు. ఇప్పుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎంఆర్ఐ, సిటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే అందుబాటులోకి వచ్చాయి. ఫోరెన్సిక్ వైద్యనిపుణులు ఉన్నారు. పల్మనాలజీ, న్యూరోఫిజీషియన్, న్యూరో సర్జరీ, పెథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, నెఫ్రాలజీ వైద్యులు అన్ని వేళలా ప్రజలకు చేరువలో ఉంటున్నారు. ఇదంతా విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయడం వల్ల కలిగిన సౌలభ్యాలన్న విషయం ప్రజలకు తెలిసిందే. గతంలో ఎన్నడూలేనివిధంగా సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి సగటున 3.70 లక్షల మందికి ఓపీ సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లు 45 వేల మంది వరకూ ఉంటున్నారు. మేజర్ ఆపరేషన్లు 5 వేలు, మైనర్ ఆపరేషన్లు 17 వేల వరకు జరుగుతున్నాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లు 20 వేలు, ఎక్స్‌రేలు 21 వేలు, ల్యాబ్ టెస్టులు 5 లక్షల వరకూ ఉచితంగా అందుతున్నాయి.

ప్రసవాలు కూడా 8 వేల వరకు పెరిగాయి. దీంతో ఉమ్మడి విజయనగరం ప్రజలకు వైద్యసేవలు చెంతనున్నాయనే మనోధైర్యంతో ఉన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ ధైర్యాన్ని చంపేసే పనులు వేగవంతం చేసింది.

బడుగు, బలహీనవర్గాలకు పెద్ద దెబ్బ



బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలకు అందుబాటులో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యం, ఆయా కుటుంబాల్లో విద్యార్థులకు వైద్య విద్యావకాశం కల్పించాలన్న ఓ మహోన్నత ఉద్దేశంతో వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించతలపెట్టారు. విజయనగరం సహా ఐదు కళాశాలలను ఆయన హయాంలోనే ప్రారంభించారు కూడా. ఇప్పుడొచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలనుకోవడం దారుణాతి దారుణం. ఇది బడుగు బలహీనవర్గాలకు పెద్ద దెబ్బ. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చేరే అవకాశాన్ని పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేసినట్లే. వాటిని ప్రైవేట్ పరంచేస్తే అక్కడ ఫీజుల బాదుడును తట్టుకోలేరు. వారు చేరకపోతే ఖాళీగా ఉండిపోయే సీట్లు మళ్లీ ఆర్థికంగా స్థితిమంతుల బిడ్డలకే దక్కుతాయి. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్నది అక్షరాలా డబ్బున్నవారికి దోచిపెట్టడమే.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త

వైద్య విద్యార్థులకు వెన్నుపోటు



ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరతీసింది. వైద్యవిద్యార్థులకు ఇది వెన్నుపోటు నిర్ణయం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు పూనుకున్నారు. అందులో 5 పూర్తిచేసి ఎంతో మంది విద్యార్థులకు వైద్యవిద్య కలను నెరవేర్చారు. ప్రస్తుతం మరో ఐదు కాలేజీలు పూర్తయినందున సీట్లు తెచ్చుకుని వైద్య విద్యను ప్రోత్సాహించాల్సిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య విద్యను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేటును ప్రోత్సాహించడం దారుణం. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు దూరం అవుతాయి.

– పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం

పేదలు చదువు 'కొనాల్సిందేనా'?



మాకు ఇద్దరు అమ్మాయిలు.. జ్యోత్స్న, లీలావతి. ఇద్దరూ నీట్ రాశారు. ప్రభుత్వం తీరు చూస్తే మాకు భయమేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వాటిని కావాలనే నిలుపుదల చేసింది. పాడేరు ఒక్కటీ బలవంతంగా ప్రారంభించాల్సి వచ్చింది. ఎన్నికల్లో మాత్రం తాము వస్తే అన్నీ ఉచిత వైద్య సీట్లను ఇచ్చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ప్రైవేటు వైద్య కళాశాలలకే ప్రాధాన్యమిచ్చే కూటమి ప్రభుత్వ హయాంలో పేదోడు తమ పిల్లల్ని ఉన్నత వైద్య విద్యను చదివించడం కష్టమే.

– కోడూరు ఆదిలక్ష్మి, రామభద్రపురం

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



నేను సామాన్య రైతుకుటుంబానికి చెందిన వాడిని. నా కొడుకును మెడిసిన్ చేయించాలన్న ఆలోచనతో చదివిస్తున్నాను. నేటి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచన వల్ల మాలాంటి కుటుంబాల విద్యార్థులను మెడిసిన్ చదివించడం కష్టమే. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యయప్రయాసల కోర్చి రాష్ట్రంలో వైద్యకళాశాలలు ఏర్పాటుచేయడం వల్ల పేదపిల్లలకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు లభించాయి. పైసా ఖర్చు లేకుండా వైద్యవిద్యను చదువుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తం చేసే ఆలోచనను విరమించుకోవాలి.

– సీహెచ్ అనంతనాయుడు, విద్యార్థి తండ్రి, పెదంకలాం, సీతానగరం

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?



కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. ఇప్పటికే విద్యాదీవన, వసతి దీవన వంటి పథకాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేదు. పేదకుటుంబాల పిల్లల చదువులు అగమ్యగోచరంలో పడ్డాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి పెడుతున్న తరుణంలో కూటమి సర్కారు ప్రైవేటు మోజులో పడి మోకాలడ్డుతోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులు నీట్‌లో ప్రతిభ కనపర్చి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధిస్తే తమ భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని భావిస్తారు. అలాంటిది వారి ఆశలు అడియాశలు చేసేలా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేలా పావులు కదపడం అన్యాయం.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

వెనుకబడిన విద్యార్థులపై 'ప్రత్యేక' శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పాఠశాల ప్రత్యేకాధికారులు పాఠశాలలను విధిగా సందర్శించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి 'మై స్కూల్ మై ప్రైడ్' కార్యక్రమంపై పాఠశాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలని ప్రత్యేకాధికారులకు స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం పాఠశాలలను సందర్శించి నివేదికలను అందించాలని, సందర్శన సందర్భంగా విద్యార్థి హాజరు, విద్యాబోధన, సాధించిన మార్కులు తదితర అంశాలను పరిశీలించాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన సమ్మేటివ్ పరీక్షల్లో విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఎన్నారో పరిశీలించాలని కోరారు. రెండేళ్లుగా రాష్ట్రంలోనే పదోతరగతి పరీక్షలలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, అదే స్థానాన్ని నిలిపేందుకు కృషిచేయాని కోరారు. ఇంగ్లిస్ మీడియం విద్యార్థులు వారు తెలుగులో పరీక్షలు రాయవచ్చని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

జపాన్ భాషపై శిక్షణ

- విదేశీ ఆస్పత్రుల్లో అవకాశాలు
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్

పార్వతీపురం టౌన్: జపాన్ భాష నేర్చుకుని ఆ దేశ వైద్య రంగంలో ఉద్యోగావకాశాలు పొందవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావీస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాషను ఎన్-5, ఎన్-4, ఎన్-3 స్థాయిల్లో నేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జపాన్ భాష నేర్చుకున్న వారికి జపాన్‌లోని ఆస్పత్రుల్లో వర్కర్స్ ఇన్, హాస్పిటల్స్, కేర్ హోమ్ ఫెసిలిటీగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. జపాన్‌లో పనిచేసేందుకు ఆసక్తి కలిగి, 32 ఏళ్లోపు వయస్సున్న వారంతా అర్హులేనని, తొలుత జపనీస్ భాషలో రెసిడెన్షియల్ విధానంలో బెంగళూరులోని నివాస్ హెచ్‌ఆర్ సంస్థ కార్యాలయంలో ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సౌకర్యాలుంటాయని, ఫీజు మాత్రం రూ. 3.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 50 వేలు నైపుణ్యాభివృద్ధి సంస్థ భరిస్తుందని మిగిలిన మొత్తాన్ని అభ్యర్థులే చెల్లించాలని మిగిలిన రూ. 3లక్షల్ని మూడు విడతల్లో చెల్లించే వెసులుబాటు ఉందని తెలిపారు. శిక్షణ ఫీజు కోసం నావీస్ హెచ్‌ఆర్ సంస్థ రుణ సదుపాయం కల్పిస్తుందని, ఉద్యోగం వచ్చాక మూడు దఫాలుగా తిరిగి చెల్లించవచ్చని స్పష్టం చేశారు. జపాన్‌లో నెలకు జీతం రూ.1.1 లక్షల నుంచి రూ.1.14 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ 9676965949 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ



రామభద్రపురం మీదుగా రాత్రిపూట ట్రాక్టర్‌తో ఇసుక తరలింపు ఇలా..

రామభద్రపురం: వేగావతి నది, ఏడొంపుల గెడ్డ నుంచి ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అధికార బలంతో కొందరు నాయకులు సహజవనరులను కొల్లగొడుతున్నారు. రాత్రిపూట ట్రాక్టర్లతో తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన నాయకులు ఏడొంపుల గెడ్డలో ఇసుకను అక్రమంగా తవ్వేసి ట్రాక్టర్ ఇసుక రూ.2,500 నుంచి రూ.3,000కు విక్రయిస్తున్నారు. వేగావతి నదిలో తవ్విన ఇసుకను పారాది వైపు నుంచి సాయంత్రం 7 గంటల సమయంలో రామభద్రపురం పోలీస్ స్టేషన్ ముందు నుంచే ఇసుక అక్రమ రవాణా సాగుతుండడం గమనార్హం. ఇసుక అక్రమ రవాణా విషయాన్ని తహసీల్దార్ సులోచనారాణి వద్ద ప్రస్తావించగా ఇసుక అక్రమ తవ్వకాలు విషయం నా దృష్టికి రాలేదన్నారు. వీఆర్వోలతో నిఘా పెట్టి ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

100లీటర్ల సారా ఊట పట్టివేత



పట్టుబడిన సారా ఊటతో ఎస్సై సింహాచలం, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని గలావిల్లి గ్రామ పరిసరాల్లో 100లీటర్ల సారా ఊటను ఎస్సై సింహాచలం, సిబ్బంది పట్టుకున్నారు. గురువారం వారికి అందిన సమాచారం మేరకు దాడిచేసి అక్కడ ఉన్న పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

భోగాపురం: మండల కేంద్రం భోగాపురానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీ గొల్లవీధికి చెందిన బమ్మిడి కనకరాజు(39) ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కనకరాజు బహిర్భూమికని చెప్పి ఇంటికి సమీపంలో బుడబంద చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బహిర్భూమి కని చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులు చుట్టుపక్కల వెతుకుతూ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో శవమై తేలాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

కొత్తవలస: అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం గ్రామం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. విశాఖపట్నంలోని దొండపర్తి ప్రాంతానికి చెందిన బి.అచ్చియమ్మ తన భర్త, కుమారుడు, బంధువులతో కలిసి కుమారుడు చంద్రశేఖర్ పెళ్లి సంబంధం విషయమై గంట్యాడ మండలం వెళ్లి తిరుగు ప్రయాణంలో కుమారుడు చంద్రశేఖర్ స్కూటీపై వస్తుండగా నిమ్మలపాలెం గ్రామం సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అచ్చియమ్మ ఆస్పత్రిలో మృతిచెందగా, చంద్రశేఖర్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి హత్య

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడ గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు గల కారణంగా తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నెక్కల చల్లం నాయుడు(30) బుధవారం రాత్రి వినాయక నిమజ్జనంలో అర్ధరాత్రి 12 గంటల వరకు పాల్గొన్నాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన పాటూరి సాయితో కలిసి రాత్రి ఒంటి గంట సమయంలో మద్యం తాగడానికి వెళ్లారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన పాటూరి సాయి రాయితో చల్లం నాయుడు తలపై బలంగా కొట్టడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేయగా సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హత్యకు ఉపయోగించిన రాయిని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

నెల్లిమర్ల: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి పార్టీకీ తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎఫ్ఐ నుంచి అంచెలంచెలుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని కొనియాడారు. కుల, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో పయనించాలని పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

హెచ్‌ఐవీ రోగులకు అందని పింఛన్లు..!

- 1500 మంది ఎదురు చూపు
- పట్టించుకునే నాథుడే కరువు



హెచ్‌ఐవీ బాధితులకు చికిత్స అందించే ఏఆర్‌టీ కేంద్రం

విజయనగరం ఫోర్ట్:

విజయనగరం పట్టణానికి చెందిన ఓవ్యక్తి హెచ్‌ఐవీ బారిన పడ్డాడు. దీంతో ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ చేయించుకుని మందులు వాడడం ప్రారంభించాడు. హెచ్‌ఐవీ బాధితులకు ఇచ్చే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. అలాగే జామి మండలానికి చెందిన ఓ వ్యక్తి హెచ్‌ఐవీ బారిన పడడంతో ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ చేయించుకుని మందులు వాడుతున్నాడు. హెచ్‌ఐవీ బాధితులకు ఇచ్చే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వ్యక్తికి కూడా ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. వీరిద్దరే కాదు వందలాది మంది హెచ్‌ఐవీ బాధితులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. నెలల తరబడి ఎదురు చూస్తున్నా వారికి మంజూరు కాలేదు. సాధారణ రోగుల మాదిరి తమకు పింఛన్ రాలేదని, హెచ్‌ఐవీ బాధితులు ఎవరినీ అడిగే పరిస్థితి లేదు. ఎందుకంటే తమకు ఉన్న వ్యాధి గురించి అందరికి తెలిసోపోతుందని వివరాలు గోప్యంగా ఉంచుతారు. దీంతో వారి పింఛన్‌ల మంజూరు గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. పింఛన్ల కోసం జిల్లావ్యాప్తంగా 1500 మంది హెచ్‌ఐవీ బాధితులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి వారికి పింఛన్లు మంజూరు కాలేదు.

హెచ్‌ఐవీ రోగులకు పౌష్టికాహారం అవసరం

హెచ్‌ఐవీ రోగుల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో వారు తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారు. పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుని, ఏఆర్‌టీ కేంద్రంలో అందించే మందులు వాడడం ద్వారా ఆరోగ్యంగా జీవించడంతో పాటు జీవితకాలం పెంచుకోవచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 1350 మందికి పింఛన్లు

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలిచింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల్లో అర్హులకు ఇచ్చిన మాదిరి హెచ్‌ఐవీ బాధితులకు కూడా జిల్లాలోని 1,350 మందికి పింఛన్లు మంజూరు చేసి అందజేసింది.

> **పింఛన్‌లు రావాల్సి ఉంది**
>
> హెచ్‌ఐవీ బాధితులు ఆన్‌లైన్‌లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. 1500 మంది హెచ్‌ఐవీ బాధితులకు పింఛన్లు రావాల్సి ఉంది.
>
> డాక్టర్ వరలక్ష్మి, ఏఆర్‌టీ కేంద్రం వైద్యురాలు

సువర్ణముఖిలో సిల్ట్ తొలగింపు

- బురదమట్టి వేరుచేసి ఇసుక సేకరణ
- బొబ్బిలిలో స్టాక్‌పాయింట్
- జేసీ సేతుమాధవన్



కొండచాకరాపల్లిలో సువర్ణముఖి నది వద్ద సిల్ట్ తొలగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

వంగర: మడ్డువలసలో గల గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఎగువ భాగంలో సువర్ణముఖి నదిని ఆనుకుని ఉన్న కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ కోసం నదిలో మడ్డి, బురద, ఇసుక (సిల్ట్) తొలగింపు చర్యలు చేపడతామని జేసీ ఎస్.సేతుమాధవన్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన మండల పరిధిలోని కొండచాకరాపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి నదిలో సిల్ట్ పేరుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నదిలో పేరుకుపోయిన మడ్డి, బురదను తొలగించి సేకరించిన ఇసుకను తరలించడం , స్టాక్‌పాయింట్ స్థలపరిశీలన వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సువర్ణముఖి నదిలో వరద పెరుగుతున్న సమయంలో వరదనీరు గ్రామాల్లో చొరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు పంటలకు నష్టం జరుగుతుందన్నారు. కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ నిమిత్తం కొండచాకరాపల్లి వద్ద నదిని ఆనుకుని ఉన్న మడ్డి, బురద తొలగిస్తామని, అందులో ఇసుకను వేరు చేసి గ్రామ సమీపంలోని ఐటీడీఏ కాలనీని ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్‌కు తరలిస్తామని చెప్పారు. అక్కడి నుంచి బొబ్బిలిలో ఏర్పాటు చేసిన స్టాక్‌పా యింట్‌కు తరలించి జిల్లాలో ప్రజల అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని తెలిపారు. పూర్తిస్థాయిలో సమీక్షించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడగా కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాలను ఆనుకుని రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఇప్పటికే రూ.21 కోట్లతో ఏడాది క్రితం నివేదికలు అందించామని మడ్డువలస ప్రాజెక్టు అధికారులు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వివరించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, మైనింగ్ డీడీ సూర్యచంద్రరావు, తహసీల్దార్ డి.ధర్మరాజు, మండల ఇరిగేషన్ అధికారులు డి.రవికుమార్, ఏఈలు రాజేష్, నితిన్, పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా కబడ్డీ పోటీలు

- 400 మంది క్రీడాకారుల హాజరు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: రోటరీక్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవతరోత్సవ్ ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగుతోంది. విద్యార్థులు, యువతలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు నెల రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకాగా.. పోటీలను జిల్లాక్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నేటి తరం పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. ఆ దిశగా తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు క్లబ్ ప్రతినిధులు మధ్యాహ్న భోజన సదు పాయం కల్పించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నవతరోత్సవ్ చైర్మన్ జయకృష్ణ, మంచుకొండ అశోక్, క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శంకర్‌రెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10కిలోల గంజాయి పట్టివేత



నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు

ఇద్దరి అరెస్ట్

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తుకానా సమీపంలో హీరోహోండాపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపి తనిఖీ చేయగా వారి దగ్గర బ్యాగ్‌లో పది కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులను అరెస్టు చేసి బైక్‌ను, గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి డీఎస్పీ బాడంగి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ నిందితులను ఒడిశాలోని కొరాపుట్ జిల్లాకు చెందిన తునాహంటల్(24), బాలు హంటల్(42)గా నిర్ధారించామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిద్దరిని బొబ్బిలి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్‌లో మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్దనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లపై సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు గురువారం తెలిపారు. మృతుడి శరీరంపై గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, అతని కుడిచేతిపై జె అనే పచ్చబొట్టు ఉందని చెప్పారు. రైల్వే సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మనగ్రోమోర్ మేనేజర్‌కు షోకాజ్

గజపతినగరం: మండల కేంద్రంలోని మెంటాడ జంక్షన్ రోడ్డులో గల మన గ్రోమోర్ ఎరువుల షాపులో రైతులకు అవసరం లేని ఎరువులను అంటగడుతున్నారని కొంతమంది నుంచి ఫిర్యాదు రావడంతో మనగ్రోమోర్ మేనేజర్ కృష్ణకు షోకాజు నోటీసు జారీ చేసినట్లు స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారిణి సీహెచ్.ధనలక్ష్మి గురువారం తెలిపారు. వ్యవసాయరంగంపై ఆధారపడిన రైతులు ఖరీఫ్ వరిపంటకు అవసరమైన డీఏపీ, యూరియా ఎరువులు కావాల్సి వచ్చినప్పుడు సెంటర్‌కు వెళ్లి అడగ్గావాటితో పాటు అవసరం లేని గుళికలను మన గ్రోమోర్ అంటగడుతోందని ఫిర్యాదు రావడంతో మేనేజర్‌కృష్ణకు షోకాజు నోటీస్ జారీచేసినట్లు ఏఓ చెప్పారు. రైతులకు అవసరం లేని ఎరువులను ఎందుకు విక్రయిస్తున్నావని దానిపై పూర్తి వివరణ (ఎక్స్‌ప్లనేషన్) ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నట్లు ఏఓ తెలిపారు. అనంతరం మనగ్రోమోర్‌లో ఉన్న ఎరువులను ఆమె తనిఖీ చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



గెడ్డలోంచి సతీష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య గల గెడ్డలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్.కోట మండలంలోని సందులూరు గ్రామానికి చెందిన అప్పబత్తుల సతీష్(30) తన భార్య వరలక్ష్మితో కలిసి బైక్‌పై అత్తవారి గ్రామం చంద్రంపేటకు బుధవారం వచ్చాడు. తిరిగి సాయంత్రం స్వగ్రామం సందులూరుకు బైక్‌పై వెళ్తుండగా చంద్రంపేట, వసంత గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డ దాటుతుండగా బండి స్లిప్ అయి గెడ్డలో గల్లంతయ్యాడు. బుధవారం రాత్రంతా గాలించినప్పటికీ సతీష్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం తెల్లవారుజామున ఎస్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చేపట్టగా సతీష్ మృతదేహం కనిపించింది. అనంతరం మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కృష్ణ తెలిపారు.

పీఎం జన్‌మన్ పథకం తుది నివేదిక అందించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధానమంత్రి జన్‌మన్ పథకానికి సంబంధించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పంపిన ప్రతిపాదనలపై విచారణ నిర్వహించి తుదినివేదిక అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో పీఎం జన్‌మన్ పథకం ప్రతిపాదనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్‌మన్ కార్యక్రమం కింద ప్రతి గ్రామానికి కావాల్సిన ఇళ్లు, రహదారులు, వెల్‌నెస్ సెంటర్లు, పాఠశాలలు, మొబైల్ టవర్లు, విద్యుత్ సదుపాయం, తాగునీరు, అంగన్‌వాడీ సెంటర్లు, మొబైల్ మెడికల్ యూనిట్లు, మల్టీపర్పస్ సెంటర్లు వీడీవీకే ఏర్పాటు తదితర 11 అంశాలకు సంబంధించి అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8283 మందికి ఇళ్లు అవసరం కాగా 5874 మందికి ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన వారి వివరాలు విచారణ చేసి అర్హత ఉంటే జాబితాలో చేర్చాలని సూచించారు. 63 హ్యాబిటేషన్లు, 13,203 ఇళ్లకు మంచినీటి సదుపాయం కల్పించాలని చెప్పారు. 215 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని నివేదికలు వచ్చాయని, వాటిని పరిశీలించి తుది నివేదికను పంపించాలని స్పష్టం చేశారు. తుది నివేదికను ఆధారంగా చేసుకుని పథకాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవ నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈఓ జి.పగడాలమ్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం



ఎన్నార్‌ై ఆస్పత్రి వద్ద డీఎస్పీ, సీఐ, ఎంఈఓలు



హర్షవర్ధన్

బొబ్బిలి:

పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కె.హర్షవర్ధన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీస్, విద్యాశాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం పాఠశాలలోతరగతులు పూర్తయ్యాక సాయంత్రం వేళ విద్యార్థులంతా ఆటస్థలానికి వెళ్లిపోయారు. ఆ సమయంలో హర్షవర్ధన్ గురుకులంలోని డార్మిటరీకి వెళ్లి అక్కడ ఓ తాడు సాయంతో ఉరివేసుకున్నాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. ఆరోతరగతికి చెందిన విద్యార్థులు అటుగా వెళ్తూ డార్మిటరీలో హర్షవర్ధన్ ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి వెంటనే పదో తరగతి విద్యార్థులకు తెలిపారు. అనంతరం వారు, రాత్రి సిబ్బంది కలిసి ఉరి నుంచి విద్యార్థిని తొలగించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ విద్యార్థిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వెంటనే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్నార్‌ై ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు విద్యార్థికి సీపీఆర్ చేశారు. అయినప్పటికీ పరిస్థితి చెప్పలేమంటూ అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ పి శ్రీనివాసరావు, సీఐ కె.సతీష్ కుమార్, ఎంఈఓలు చల్ల లక్ష్మణ రావు, గొట్టాపు వాసు తదితరులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి ఆత్మహత్యా యత్నం చేసిన విద్యార్థికి చర్మవ్యాధి ఉందని గుర్తించారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు కానీ, విద్యార్థులు కానీ ఏమన్నా అన్నారా? లేక తల్లిదండ్రులు మందలించారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. విద్యార్థి హర్షవర్ధన్ గంట్యాడ మండలంలోని బురదపాడు గ్రామానికి చెందిన రైతు సంజీవరావు కుమారుడు. ఆ విద్యార్థికి తల్లి, సోదరి ఉన్నట్లు తెలియగా వారికి సమాచారమిచ్చారు.

17నుంచి స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అక్టోబర్ 2న నిర్వహించే స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 1వ తేదీవరకు' స్వభావ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం జిల్లాలో నిర్వహించనున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ స్వభావ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. షెడ్యూల్ ప్రోగ్రాంను పర్యవేక్షించి, సమీక్షించడానికి జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీని కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, డీఆర్‌ఓ, డీఈఓ ఇతర అధికారులను కమిటీగా ఏర్పాటుచేయనున్నామని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ కె. రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్

జిల్లాలో స్వచ్ఛత హై సేవ

విజయనగరం ఫోర్ట్: ఈనెల17 నుంచి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛత హై సేవా కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఓ బాలాజీ, డీపీఓ శ్రీధర్ రాజా, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో జీవించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: యువత క్రమశిక్షణతో జీవించడం ద్వారా హెచ్‌ఐవీ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఆగస్టు 29వతేదీన నిర్వహించిన 5 కె మారథాన్‌లో గెలుపొందిన వారికి గురువారం ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని సూచించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. పురుషుల్లో పి.సాయికి ప్రథమ బహుమతి (రూ.7 వేలు), కె. రాముకు ద్వితీయ బహుమతి(రూ.4వేలు), బాలికలలో పి.వసంతకు ప్రథమ బహుమతి, వి.భార్గవికి ద్వితీయ అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీపీఎం ఉమామమేశ్వరావు, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో ప్రధాన సూత్రధారులను అరెస్ట్ చేయాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాను నియంత్రించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ స్టేషన్ పరిధిలో కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదై, దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులను, మిస్సింగ్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి సంబంధిత దర్యాప్తు అధికారులకు చేపట్టాల్సిన చర్యలు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి కేసుల్లో ప్రధానపాత్రధారులను, సూత్రధారులను, పరారీలో ఉన్న నిందితులను తప్పనిసరిగా అరెస్ట్ చేయాలన్నారు. నిందితుల ఆచూకీని కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, సాంకేతికత పరిజ్ఞానంతో సమాచారం సేకరించి, వారిని అరెస్ట్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో దర్యాప్తులో ఉన్న అదృశ్యం కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంతవరకూ సంబంధిత అధికారులు చేపట్టిన దర్యాప్తును పరిశీలించారు. అదృశ్యం కేసుల పట్ల అలసత్వం వద్దన్నారు. కేసు నమోదైన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీని సాంకేతికత ఆధారంగా కనుగొని, వారి తల్లిదండ్రులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సైబర్ మోసాల కేసులను సమీక్షించి నిందితుల బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ అయిన మొత్తాన్ని బాధితులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, పి.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

చింతపల్లి పోలీస్ స్టేషన్ సందర్శన



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డీఎస్పీ కాళిదాసు

పూసపాటిరేగ: కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ నార్త్ డివిజన్ డీఎస్పీ ఎస్. కాళిదాసు చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులన్నీ తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి పోలీస్‌స్టేషన్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా సముద్రానికి వచ్చే భక్తులు నీటిలో స్నానాలకు దిగి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా పలు సూచనలు చేశారు. మెరైన్ పోలీసులు తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మత్స్యకార గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని కోరారు. నిలగర్ల పేట సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి అక్కడి మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ సమయంలో వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సముద్రం మీద విదేశీ బోట్లు, కొత్త వ్యక్తులు కనిపించి న ఎడల మెరైన్ పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచిం చారు. కార్యక్రమంలో చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ కె. వైకుంఠ రావు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.